RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | బుధవారం | 14 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 269 | పేజీలు : 4 | వెల : 5/-

## 300 యూనిట్ల కరెంట్ ఫ్రీ

ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ



3లో



# నోటి మాటలకు నీటి లెక్కలు తేలేనా..?

- కృష్ణ నదీ జలాలపై కొనసాగుతున్న వివాదం
- అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం
- పరిష్కారం పక్కన పెట్టి మాటల యుద్ధం
- నీటి వాటాలపై ప్రజల్లో అయోమయం



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే విషయంలో జరుగుతున్న గొడవ తారాస్థాయికి చేరింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పోటాపోటీగా విమర్శలు చేసుకుంటున్నాయి. కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తామని గత ప్రభుత్వం చెప్పిందని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానది ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తున్నదని భారత రాష్ట్ర సమితి విమర్శిస్తోంది. ఈ నేపథ్యంలో కృష్ణ నది ప్రాజెక్టులపై వాస్తవాలు అనే పుస్తకాన్ని ప్రభుత్వం శాసనసభ వేదికగా సోమవారం ఆవిష్కరించింది. అయితే ఈ పుస్తకం పై నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు. శాసనసభ వేదికగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఆయన పూర్తిగా ఖండించారు. “ రెండవ అపెక్స్ కమిటీ

మిగతా 4వ పేజీలో...

## సాగర్‌లో సీడబ్ల్యూసీ..

- డ్యాంను పరిశీలించిన అధికారుల బృందం
- నీటి నిల్వలు, డ్యాం భద్రత, నీటి వినియోగంపై పర్యవేక్షణ

4లో



## మేడిగడ్డలో ముఖ్యమంత్రి

వరంగల్ - ప్రభాతసూర్యుడు : సీఎం రేవంత్‌రెడ్డి బృందం మేడిగడ్డ బ్యారేజీ వద్ద కుంగిన పిల్లర్లను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నేతలు ప్రాజెక్టు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఈ పర్యటనకు

మిగతా 4వ పేజీలో...

# ప్రజలు చూడాలనే ప్రాజెక్ట్ విజిట్

వరంగల్ - ప్రభాతసూర్యుడు : గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి నిజానిజాలు ప్రజలకు తెలియజెప్పాలనే ఉద్దేశంతో తామంతా మేడిగడ్డ బ్యారేజీ పర్యటన చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రజల కష్టార్జితంతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ధన దాహానికి బలైందని ఆరోపించారు. దాదాపు రూ.97 వేల కోట్లు ఖర్చు చేసినా కూడా.. ఆ ప్రాజెక్టు వల్ల 97 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టు డిజైన్ నుంచి నిర్మాణం దాకా అన్నీతానై కట్టానని కేసీఆర్ చెప్పుకునేవారని గుర్తు చేశారు. అలాంటిది మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిని మూడు నెలలు అవుతున్నప్పటికీ కేసీఆర్ నోరు మెదపడం లేదని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ రిపేర్లకు పనికి రాదని అన్నారు. పూర్తిగా దాన్ని కూల్చేసి మళ్లీ నిర్మించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. దానికి రిపేర్లు కుదరబోవని.. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీనే అభిప్రాయపడిందని అన్నారు. ఈ మే-రకు రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తెలంగాణ ప్రజల కష్టార్జితంతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ధన దాహానికి బలైంది. రూ.97 వేల కోట్లు వ్యయం చేసి, 97 వేల ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రాజెక్టు డిజైన్ నుండి నిర్మాణం వరకు అన్నీతానై కట్టానని చెప్పిన కేసీఆర్, మేడిగడ్డ కూలి నెలలు గడుస్తున్నా నోరు విప్పడం లేదు. మేడిగడ్డ బ్యారేజీ

మిగతా 2వ పేజీలో...

# ప్రాణం పోయినా అన్యాయం జరగనివ్వను

నల్లగొండ - ప్రభాతసూర్యుడు : తన ప్రాణం పోయినా తెలంగాణకు అన్యాయం జరగనివ్వబోనని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తేల్చి చెప్పారు. నల్గొండ శివారులోని మర్రిగూడ బైపాస్ ప్రాంతం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన



బహిరంగ సభలో పాల్గొని కేసీఆర్ ప్రసంగించారు. కృష్ణా జలాల కోసం చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని ప్రజలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మాజీ సీఎం కేసీఆర్ బయటికి వచ్చి ప్రజల మధ్యకు రావడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. “క్రిష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన సంపూర్ణమైన వాటా వచ్చేదాకా కొట్లాడతాం. నేను పిలుపిస్తేనే భయపడి సభలో తీర్మానం పెట్టారు. దాంతో చాలదు. అఖిల పక్షం ఏర్పాటు చేసి కేంద్రానికి తీసుకుపోండి. కావాలంటే ఐదేళ్లు అధికారంలో ఉండండి. మాకేం ఇబ్బందిలేదు. ఉమ్మడి రాష్ట్రమే బాగుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి ఇచ్చేలా ఢిల్లీలో

మిగతా 2వ పేజీలో...



## ఎన్నికల కోసమే కాళేశ్వరం కథ !

కాంగ్రెస్ తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : శాసనసభలో సభా సంప్రదాయాలను ఉల్లంఘించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికార పక్షం మాట్లాడిన తర్వాత ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకపోవడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని చెప్పారు.

3లో

# కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

- మళ్లీ కాళేశ్వరం పోవడం ఎందుకు?
- మంత్రులు, ఇంజనీర్ల నివేదిక సరిపోదా?
- సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదు?
- కృష్ణా నీటి పేరుతో బీఆర్ఎస్, కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ నాటకాలు
- బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాల్సిందే
- ప్రజాహిత యాత్రలో ఎంపీ బండి విమర్శలు



కరీంనగర్ - ప్రభాతసూర్యుడు : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రులు హెలికాప్టర్ లో కాళేశ్వరం వెళ్లొచ్చారని,ఇంజనీరింగ్ నిపుణుల బ్రుందం వెళ్లి విచారణ జరిపి నివేదిక కూడా ఇచ్చిందని, కేంద్ర బ్రుందం కూడా ప్రాజెక్టును సందర్శించి నివేదిక ఇచ్చింది కదా మళ్లీ సీఎం సహా మంత్రులంతా వెళ్లాల్సిన అవసరం ఏముందని, కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్, క్రిష్ణా నీటిపై నల్గొండలో సభ పేరుతో బీఆర్ఎస్ నాటకాలాడుతున్నయని, విలువైన అసెంబ్లీ సమయాన్ని వృధా చేస్తూ ప్రజలకు

మిగతా 3వ పేజీలో...



## 'ఛలో ఢిల్లీ'లో ఉద్రిక్తత

3లో



## అబుదాబీలో హిందు టెంపుల్

2లో

## ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట తహసీల్దార్

మేడ్చల్ మల్కాజ్‌గిరి - ప్రభాతసూర్యుడు : లంచం తీసుకుంటూ శామీర్‌పేట తహసీల్దార్ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. తహసీల్దార్ కార్యాలయంలోనే ఓ వ్యక్తి నుంచి రూ. 10 లక్షలు లంచం తీసుకుంటుండగా తహసీల్దార్ సత్యనారాయణను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కార్యాలయంతో పాటు సత్యనారాయణ ఇంట్లో సోదాలు చేపట్టారు. పాస్‌బుక్‌ల కోసం రూ. 10 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు.



# మర్యాద మతలబ్!

- నేతలు పార్టీల పిరాయింపులకు శ్రీకారం
- సీఎం రేవంత్‌తో భేటీ తర్వాత చేరిక
- బీఆర్ఎస్ నుంచి పెరుగుతున్న వలసలు
- గ్రేటర్‌లో బీఆర్ఎస్‌కు షాక్
- కాంగ్రెస్‌లోకి డిప్యూటీ మేయర్

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది తెలంగాణ రాజకీయాలు ఆసక్తిగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ కనీసం లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ గెలుపు సాధించాలని వ్యూహాలు రచిస్తోంది. బీఆర్ఎస్ ఈ హడావుడిలో ఉండగా నేతలు కాంగ్రెస్ గూటికి క్యూ కడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారు. మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని డైరెక్ట్ కలుస్తున్నారు. కానీ పార్టీ మారడం లేదు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. అధిష్టానానికి చెప్పకుండా రేవంత్ రెడ్డితో కలవద్దని కేసీఆర్ పార్టీ శ్రేణులను హెచ్చరించినట్లు



మిగతా 3వ పేజీలో...



4లో

## బిహార్ బ్యాచ్‌లో టెన్షన్

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com


## అబుదాబిలో హిందూ మందిరం

### నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు : ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అరబ్ లో ఘన స్వాగతం లభించింది. రెండు రోజుల పాటు అబూదాబిలో పర్యటిస్తారు మోదీ. ఈ రెండు రోజుల పర్యటనలో ప్రధాని మోదీ అబుదాబిలో నిర్మించిన తొలి హిందూ దేవాలయాన్ని కూడా ప్రారంభించను న్నారు. ప్రధాని మోదీ పర్యటనపై యూఏఈలోని ప్రవాస భారతీయుల్లో ఉత్సాహం నెలకొంది. గత తొమ్మిదే ళ్లలో, యుఎఇతో భారతదేశ సహ కారం వాణిజ్యం, పెట్టుబడి, రక్షణ, భద్రత, ఆహారం, ఇంధన భద్రత, విద్య వంటి వివిధ రంగాలలో అనేక రెట్లు పెరిగిందని అన్నారు. యుఎఇ కాలమానం ప్రకారం, మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రధాని అక్కడ దిగనున్నారు. ఆ తర్వాత యుఎఇ దేశాధినేతతో పాటు పలువురు నేత లతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. మోదీ రాక సందర్భంగా యూఏఈలో ఏర్పాటు చేసిన అహ్లాన్ మోదీ కార్యక్రమంలో ప్రారంభం కానుంది. ప్రధానిపాల్గొంటారు.

## అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు



అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు : నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు, హోర్డింగ్‌లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సర్వే నెంబర్ 470 లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తో బహుళ అంతస్తు భవన నిర్మాణం జరుగుతుందని, జాతీయ రహదారికి ఆనుకొని అనుమతులు లేకుండా హోర్డింగులు ఏర్పాటు చేశారన, వీటిపై తగిన చర్యలు తీసుకుని మున్సిపాలిటీ ఆదాయాన్ని కాపాడాలని, మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్ రెడ్డికి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యాంజాల ప్రహ్లాద, చెరుకూరి నరసింహ, కొరివి నరసింహ, బొర్ర పెద్ద నరసింహ, ఉసిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.






## ఆరు గ్యారంటీలపై ఆందోళన వద్దు

### కాంగ్రెస్ కిసాన్ సెల్ నేత కావలి ముగ్గు రాములు

మంచాల - ప్రభాత సూర్యుడు : మంచాల మండలం ఆరుట్ల గ్రామం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల భాష ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంచాల మండలం కిషన్ సెల్ మండల అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్, సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ కలిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు అమలు విషయంలో ప్రతిపక్ష పార్టీలు కొన్ని మీడియా సంస్థలు ఇష్టం వచ్చినట్టు కారు బంగ్లాలు భారీ వాహనాలు ఎవ్వరికీ ఉన్న ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు అమలు కావు అని మీడియాలో ప్రచారం చేయటాన్ని ప్రజలు నమ్మవద్దు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారంటీల పథకాలు అమలు చేయటానికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉంటేనే సంక్షేమ పథకాలు అమలు అవుతాయి అని కొన్ని మీడియాలలో వచ్చే విష ప్రచారాలు నమ్మవద్దు అని ఈ సందర్భంగా అన్నారు. అధికారులే ప్రతి ఇంటి వద్దకు వెళ్లి అర్హులైన వారిని గుర్తించి ఆరుగ్యారంటీల పథకాలు అమలు చేస్తారు తెల్ల రేషన్ కార్డు లేని ప్రజలకు కార్డు మంజూరు అయినా తర్వాత వారికి కూడా ఆరు గ్యారంటీల పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయటానికి సమయం కాస్త ఆలస్యమైన అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గంలోని అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయించడానికి సిద్ధంగా ఉన్నాడు నియోజకవర్గం లోని ప్రతి గ్రామం వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ అక్కడక్కడ అభివృద్ధి పనులు శంకుస్థాపనలు చేస్తూ ఇప్పటికే శభాష్ ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్న గొప్ప నాయకుడు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మరింత వేగంగా అభివృద్ధి చెందాలంటే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు కావాలంటే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పై దృష్టి సారించి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి ఆప్పుడే ఇబ్రహీంపట్నం వేగంగా అభివృద్ధి జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పంబాల బుగ్గ రాములు, ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంబాలపల్లి బుగ్గ రాములు, తిమ్మగళ్ళ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## 2027 నాటికి లెప్రసీ ఫ్రీ ఇండియా కావాలి




### హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్

అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో 2027 సంవత్సర నాటికి లెప్రసి (కుష్టు వ్యాధి) ఫ్రీ ఇండియా దిశగా మార్చాలని గేయంతో పని చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి శాంతినగర్ కాలనీలో కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి అంటువ్యాధి కాదని, కుష్టు వ్యాధిగ్రస్తులను పట్ల వివక్ష చూపకుండా మానవతా దృక్పథంతో మెలగాలని సూచించారు. ఆ దిశగా అవగాహన కల్పించాలని కోరారు. కుష్టువ్యాధి ప్రమాదకరమైన జబ్బు కాదని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే మందులతో తగ్గుముఖం పట్టి తిరిగి సాధారణ స్థితికి చేరుకోవచ్చని తెలిపారు. ఈ వ్యాధికి అన్ని ప్రాథమిక కేంద్రాల్లో ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని కేవలం నిరంతరాయంగా కొనసాగించాలని కోరారు. కుష్టి వ్యాధిగ్రస్తుల కోసం పనిచేస్తున్న వారందరిని అభినందించారు.

అనంతరం వ్యాధిగ్రస్తులకు పండ్లు దుప్పట్లను పంపిణీ చేశారు. హిందూ కుష్టు నివారణ సంఘం వైస్ ఛైర్మన్ టి.వి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డా.జాన్ బాబు, రంగారెడ్డి, హైదరాబాద్ అడిషనల్ డీఎంహెచ్ఓలు డా.అరుణ, డా.నిర్మల ప్రభావతి, శివానంద హెూం సీఈవో డా.అనంతరెడ్డి, స్లాప్(సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్)రాష్ట్ర అధ్యక్షుడు మనియాద రమేష్, డీపీఎంఓలు, ఏపీఎంవోలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



యాచారం మండలం ఎంపీడీవో గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్ రెడ్డిని మండల ఎంపీపీ సుకన్య బాషా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.
- ప్రభాత సూర్యుడు, యాచారం

## సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం



ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు : ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో సత్యసాయి సేవ సమస్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం పశువైద్యశాల సహాయక సంచాలకులు పి వసంతకుమారి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి ఉత్పత్తికి, మేలుకొరకు, పశుగ్రాసాల సాగు గురించి, గర్భ సంబంధ వ్యాధుల గురించి వివరించారు. మంగళవారం జరిగిన ఈ శిబిరంలో 42 పశువులకు సుడి పరీక్షలు, 25 పశువులకు గర్భ సంబంధమైన చికిత్సలు చేశారు. 40 దూడలకు నట్టల మందులు, 35 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ గ్రామ ఎంపీటీసీలు గంగిరెడ్డి జ్యోతి భాస్కర్ రెడ్డి, అచ్చన్న శ్రీశైలం, ఎలిమినేడు పశువైద్య అధికారి డాక్టర్ టి. సురేష్ బాబు, మంచాల పశు వైద్యాధికారి డాక్టర్ వి. సుధా, పశు వైద్య సిబ్బంది కవిత, పురుషోత్తం, ప్రవీణ్, గోపాల మిత్రులు, జగన్, శివరాజ్, సత్యసాయి సేవా సమితి సభ్యులు డాక్టర్ పున్నయ్య, డాక్టర్ రామన్న, జిల్లా అధ్యక్షులు యాదగిరిరావు, గ్రామ సేవాదళ్ జంగారెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి బలవంత రెడ్డి, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం పోయినా అన్యాయం జరగనివ్వను

మొదటిపేజీ తరువాయి..

సంతకం పెట్టి వచ్చారు. నాలుగైదురోజులు కాంగ్రెస్ మంత్రులు నాటకాలాడారు. అసెంబ్లీలో కూడా బడ్జెట్ పక్కకు పెట్టి ప్రాజెక్టులపై చర్చ పెట్టారు. సాగునీటిపారుదల మంత్రిగా పని చేసినందునే మొన్న హరీశ్ రావు గట్టిగా సమాధానం ఇచ్చారు. ప్రజల్లోనే తేల్చుకుందామని నల్గొండ సభకు పిలుపు ఇచ్చా. నేను పిలుపు ఇవ్వగానే సభలో హడావుడిగా తీర్మానం పెట్టారు. అది కూడా సరిగ్గా పెట్టలేదు. దాంట్లో విద్యుత్ సంగతి లేనేలేదు. కాంగ్రెస్ వాళ్లు తెలివి తక్కువ తీర్మానం పెట్టారు. కొత్త ప్రభుత్వం ఒక్కటైనా మంచి పని చేస్తుందా? గట్టిగా మాట్లాడితే మీరు పెద్దోళ్లు అయిపోతరా? ఎవరికీ అధికారం శాశ్వతం కాదు. తెలంగాణ ప్రజల హక్కులు, వాటాలు శాశ్వతం. కేసీఆర్ సర్కారు పోగానే స్విచ్ తీసేసినట్లు కరెంటు పోతోంది. అసెంబ్లీలోనే జనరేటర్లు తెచ్చి పెడుతున్నరు.. అలాంటిది ఏప్రిల్, మే నెలల్లో 24 గంటల కరెంటు ఇస్తరా? నేను తొమ్మిదిన్నరేళ్లు 24 గంటల కరెంటు ఇచ్చా. ఇప్పుడు కరెంటు ఏమైపోయింది? చేతగాని వాళ్ల రాజ్యం ఇలాగే ఉంటుంది. కరెంటు కోసం అందరూ ఎక్కడికక్కడ నిలదీయండి. మేం ఈ ఛలో నల్గొండతోనే ఆపం.. ఇలాంటి పోరాటం సాగుతూనే ఉంటుంది. మేం ఇచ్చినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 24 గంటల కరెంటు ఇవ్వాలి. మీకు దణ్ణం పెట్టి చెప్తున్నా.. నేను మీ బిడ్డను, చావు నోట్లో తలకాయ పెట్టి చావు వరకూ పోయి తెలంగాణ తెచ్చింది నేను. అందుకే రాష్ట్రం బాగు కోసం నాకు తన్నులాట ఉంటది. అప్పట్లో రైతు బంధు పడ్డట్లు మీ ఫోన్లు టింగ్ టింగ్ అని మోగేవి. ఇప్పుడు అసెంబ్లీలో వారి వాగుడే వినబడుతోంది. మీరేం ఫికర్ కావొద్దు.. మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి వస్తది. ఇయ్యాల కొత్త దుకాణం మొదలుపెట్టిన్రు. పంటకు కనీస మద్దతు ధర వస్తే వాళ్లు చెప్పిన బోనస్ రూ.500 ఇవ్వరట. మా ప్రభుత్వం ఉన్నప్పుడు మద్దతు ధర ఇవ్వలేదా? ధాన్యం కొనలేదా? మీ అబద్ధపు మాటలతో జనాన్ని మోసం చేస్తే నడవదు బిడ్డా" అని కేసీఆర్ మాట్లాడారు.



## ప్రజలు చూడాలనే ప్రాజెక్ట్ విజిట్

మొదటిపేజీ తరువాయి..

మరమ్మతులకు పనికి రాదు. పూర్తిగా పునర్ నిర్మాణం చేయాల్సిందేనని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో వాస్తవాలు తెలంగాణ సమాజానికి తెలిపే ప్రయత్నం ప్రజా ప్రతినిధుల నేటి మేడిగడ్డ పర్యటన. కేసీఆర్ తో పాటు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను కూడా ఆహ్వానించాం. బీఆర్ఎస్ తో పాటు వారి చీకటి మిత్రులు బీజేపీ శాసన సభ్యులు మేడిగడ్డకు రావడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు.. చంద్రశేఖర్ రావుకు ఏటీఎంలా మారిందని ప్రధాని మొదలు గల్లీ లీడర్ వరకు లొల్లి చేసే బీజేపీ నాయకులు.. వాస్తవాలు చూడడానికి క్షేత్రస్థాయికి రావడం లేదు. అన్నీ పార్టీల శాసన సభ్యులు ఒకవైపు ఉంటే బీజేపీ, బీఆర్ఎస్ మాత్రం ఒకటిగా మరొకవైపు ఉన్నాయి. మేడిగడ్డ పర్యటనతో తెలంగాణ సమాజం తొమ్మిదిన్నరేళ్లు కేసీఆర్ పాలనలో విధ్వసమైన జలదృశ్యాన్ని కళ్లారా చూడబోతోంది" అని రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# 300 యూనిట్ల కరెంట్ ఫ్రీ

### ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ - ప్రభాతసూర్యుడు :** ఎన్నికలు సమీపిస్తున్న కేంద్ర ప్రభుత్వం వరుసగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే అనేక కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. తాజాగా మరో కీలక పథకాన్ని ప్రకటించింది. దేశ ప్రజలందికీ ఉచితంగా విద్యుత్ అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలి యోజన' పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పథకానికి రూ. 75,000 కోట్లు ఖర్చు అవుతుందని, ప్రతి నెలా 300 యూనిట్లకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా దేశ వ్యాప్తంగా 1 కోటి ఇళ్లలో విద్యుత్ వెలుగులు నింపుతామని పేర్కొన్నారు.

**ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్..**

మరింత స్థిరమైన అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం 'ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన'ను ప్రారంభిస్తున్నాము. ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 75,000 కోట్లతో, ప్రతి నెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా కోటి గృహాల్లో వెలుగులు నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.' అని ట్వీట్ చేశారు మోదీ.

# దిల్‌సుఖ్‌నగర్‌లో యువకుడిపై హత్యా యత్నం

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** శ్రీనివాస్, జమిల్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు కలిసి మద్యం తాగారు. స్వల్ప వివాదం జరిగింది. సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి మేఘా టాకిస్ వద్ద మద్యం సిసాను పగులకొట్టి శరీరంలోని వివిధ భాగాల్లో దాడి చేశాడు. తప్పించుకుని వచ్చిన శ్రీనివాస్ చర్మాస్ వద్ద పడిపోయాడు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న చాదర్ ఘాట్ పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ కు వైద్యం అందిస్తున్నారు.

# 'ఛలో ఢిల్లీ'లో ఉద్రిక్తత




**న్యూఢిల్లీ- ప్రభాతసూర్యుడు :** పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం ఉద్రిక్తతలకు దారి తీసింది. 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో భాగంగా పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని శంభు బార్డర్‌కు రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ముందుగా పోలీసులు వచ్చిన వాళ్లను వచ్చినట్టే అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు.కానీ, కాసేపటికే రైతుల సంఖ్య పెరగడంతో అరెస్టులు సాధ్యం కాలేదు. వారిని చెదరగొట్టేం దుకు టియర్ గ్యాస్ ప్రయోగిం చారు. దాంతో ఆందోళనకారులు పరుగులు తీశారు. అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.





# ఆపరేషన్ ఆకర్ష్‌లో పార్టీలు...

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :** బీఆర్ఎస్ నేతల సెకండ్ క్యాడర్ చేరికలపై ఫోకస్ పెట్టింది కాంగ్రెస్. ఘర్ వాపసీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బడా నేతల కంటే.. సెకండ్ క్యాడర్ నేతలపైనే ఎక్కువ దృష్టి పెట్టింది. ఇప్పటికే పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ పదిహేను రోజులలో భారీ చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2014 కంటే ముందు కాంగ్రెస్ బలంగా ఉండేది. ప్రతి గ్రామంలో బలమైన క్యాడర్ ఉండేది. అయితే 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో పాటు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయంగా అనేక మార్పులు జరిగాయి . ఈక్రమంలోనే కాంగ్రెస్ నుండి పెద్ద ఎత్తున బీఆర్ఎస్?కి వలసలు పెరిగాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం?పై తీవ్రమైన వ్యతిరేకత ఉన్న కారణంగా ప్రజలు కాంగ్రెస్?కి ఓట్లు వేసారు. అయితే పార్టీ?ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది కాంగ్రెస్. గతంలో బీఆర్ఎస్?కి వెళ్ళిన వారిని తిరిగి కాంగ్రెస్?లోకి తీసుకుంటుంది. పార్లమెంటు ఎన్నికల కంటే ముందే ఈ అపరేషన్?ని మొదలు పెట్టనుంది. ప్రభుత్వం ఏర్పాటు తరువాత ఇప్పటికే కొంత మంది ముఖ్య నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎంపి ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలోనే బలమైన క్యాడర్ కోసం చేరికలని ప్రోత్సహిస్తుంది కాంగ్రెస్.కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఎర్పడినప్పటి నుంచి ఆ పార్టీ బలంగా ఉంది. ఆ పార్టీకి మళ్ళీ అవకాశం ఇవ్వకుండా గ్రామస్థాయిలో కాంగ్రెస్ పటిష్టమైన క్యాడర్ నిర్మించుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మురం చేసింది. ఇప్పటికే పలు అవిశ్వాలు పెట్టి బీఆర్ఎస్‌పై పైచేయి సాధించింది. చాలా మున్సిపాలిటీల నుండి బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. జమ్మికుంటలో ఏకంగా పదమూడు మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చొప్పదండి, మానకొండూర్, వేములవాడ తదితర అసెంబ్లీల నుంచి బీఆర్ఎస్ క్యాడర్ కాంగ్రెస్?లో చేరుతున్నారు. కరీంనగర్ పార్లమెంటు ఎన్నికలలో విజయం సాధించాలంటే గ్రామస్థాయిలో పటిష్టంగా ఉండాలని చేరికలని ప్రోత్సహిస్తున్నారు. ఈ పదిహేను రోజులలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయాల సమీకరణాలు వేగంగా మారనున్నాయి.





# మర్యాద మతలబ్!

**మొదటిపేజీ తరువాయి..**

పార్టీ వర్గాలు తెలిపాయి. అయిన అధినేత సూచనలు కొందరు తుంగలో తొక్కి సీఎంను కలుస్తున్నట్లు సమాచారం. మరి రేవంత్‌తో ఎమ్మెల్యేల భేటీలు, లోకల్ స్థాయి కీలక నేతల నుంచి ముఖ్యనేతల వరకు కొందరూ కాంగ్రెస్‌లో చేరడం గులాబీ బాస్ వ్యూహంలో భాగమా? లేక నిజంగానే కేసీఆర్‌కు షాక్ ఇచ్చారా? అని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అసెంబ్లీలో పరాజయం తర్వాత మాజీ సీఎం కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించడం కోసం కోవర్టు ఆపరేషన్ లాంటిది ఏమైనా స్టార్ట్ చేశారా? అనేది పొలిటికల్ సర్కిల్లో టాక్ నడుస్తోందిఇటీవల పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి తెలంగాణ భవన్‌లో అధినేత కేసీఆర్ అడుగపెట్టి నేతలతో సమీక్షించిన రోజే ఈ పరిమాణం చోటుచేసుకోవడం గమనార్హం. తాజాగా గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన కేటీఆర్ ప్రధాన అనుచరుల్లో ఒకరైనా మాజీ డిప్యూటీ మేయర్, ప్రస్తు త బోరబండ కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్ హస్తం తీర్థం పుచ్చుకున్నారు. సీనియర్ నేత జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆదివారం సీఎంతో భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లోకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తోంది. మరోనేత నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్‌లోకి చేరనున్నట్లు తెలిసింది. గతంలోనే సీనియర్ నేత, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పాలనుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కీలక నేత మన్నె జీవన్ రెడ్డితో ఆ జిల్లా నేతలు హస్తం గూటికి చేరారు. పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు మొదలైనాయి. ఈ క్రమంలోనే పలు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పాలన పోయి, కాంగ్రెస్ కార్పొరేటర్లు చైర్మన్లుగా విజయం సాధించారు. దీంతో లోకల్‌లో ఉండే కీలక నేతలు సైతం కాంగ్రెస్‌లోకి జంప్ అవుతున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, అతని భార్య జడ్పీ చైర్‌పర్సన్ సునిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. వారు దాదాపు పార్టీలో చేరడం ఖరారు అయ్యిందని టాక్ నడుస్తోంది. ముఖ్యంగా ఒకే సారి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎంను కలిశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు కూడా కొద్ది రోజుల క్రితం రేవంత్ రెడ్డిని కలిశారు. మరోవైపు వారు కాంగ్రెస్ పార్టీలో చేరడం లేదని తెలిపారు. మరోవైపు సీఎంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కూడా కలిశారు. సీఎంను కలిశాక ఆయన బీఆర్ఎస్ సమావేశానికి డుమ్మా కొట్టారు. కానీ నిధుల విషయంలో సీఎంను కలిశానని చెప్పుకొచ్చారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డిని వరుసగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు కలవడం బీఆర్ఎస్‌లో అలజడి మొదలైంది.

**గ్రేటర్ లో బీఆర్ఎస్‌కు షాక్**

గ్రేటర్ హైదరాబాద్ లో బీఆర్ ఎస్ కు షాక్ తగిలింది.జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ దంపతులు మంగళవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసారు. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ కాంగ్రెస్ లో చేరనున్నారు. కొంతకాలంగా బీఆర్ఎస్ పై ఆమె అసంతృప్తితో ఉన్నారు. మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్ను కలిశామని శ్రీలత అన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

**మొదటిపేజీ తరువాయి..**

ఇచ్చిన హామీలను గాలికొదిలేశాయ్ అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృధా చేసిన కేసీఆర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పు చేశానని ముక్కు నేలకు రాసి కేసీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. అట్లాగే ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయనందుకు కాంగ్రెస్ పార్టీ కూడా క్షమాపణ కోరాలన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా 4వ రోజు మధ్యాహ్నం కోనరావుపేట మండల కేంద్రానికి వచ్చిన బండి సంజయ్ కు స్థానిక ప్రజలు పూలు చల్లి, హారతిపట్టి ఘన స్వాగతం పలికారు. ఊహించని రీతిలో వేలాది మంది ప్రజలు బండి సంజయ్ ను చూసేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బండి సంజయ్ స్థానికులను ఉద్దేశించి ప్రసగిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై నిప్పులు చెరిగారు. అనంతరం మీడియాతోనూ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల డ్రామాలను ఎండగట్టారు. మీకోసం బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్ కు ఎందుకు ఓటేశారని దేశమంతా చర్చ జరుగుతోంది. మోదీ ప్రభుత్వం 2.4 లక్షల ఇండ్లు తెలంగాణకు ఇస్తే.. కేసీఆర్ ఒక్క డబుల్ బెడ్రూం కట్టియ్యలే. మీ కోసం 16 వందల కిలోమీటర్లు తెలంగాణ మొత్తం పాదయాత్ర చేసిన. త్యాగాలు మేం చేస్తే భోగాలు కాంగ్రెస్ అనుభవిస్తోందని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదు? రైతులకు రుణమాఫీ రూ.2లక్షలు, ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు బంధు ఇయ్యలే. 6 గ్యారంటీలకు దిక్కులేదు. మీరు ఓట్లేసి గెలిపిస్తే కాంగ్రెస్ చేసిన మేలు ఏంది అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ కోసం భారీ ఎత్తున నిధులిచ్చింది. ఒక్క వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి రూ.575 కోట్ల 91 లక్షల రూపాయలిచ్చింది. ఈ ఒక్క మండలానికి ఉపాధి హామీ కింద రూ.48 కోట్ల 25 లక్షలిచ్చింది. రోడ్ల మెటీరీయల్ కోసం 23 కోట్ల 25 లక్షలు, మొక్కల పెంపకానికి 33 కోట్ల 91 లక్షలిచ్చింది. ఆ నిధులేమైనయని అడిగితే వర్షాలకు మొక్కలు కొట్టుకుపోయాయని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నరు. మీరే ఆలోచించండి. ఇతర పనుల కోసం రూ.19 కోట్ల 52 లక్షలు, చెత్త సేకరణ కోసం రూ.16 లక్షలు, టాయిలెట్ల కోసం 2 కోట్లకుపైగా, కిసాన్ సమ్మాన్ నిధి రోడ్ల కోసం రూ.3 కోట్లు ఇచ్చినం. కొనరావుపేట గ్రామానికి రూ.9 కోట్లకుపైగా నిధులిచ్చినం. బండి సంజయ్ చెప్పింది తప్పయితే నాపై కేసు పెట్టండి. అట్లాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలను మీరే మిచ్చారని నిలదీయండి? మేం ఇన్ని పనులు చేస్తుంటే.. ఇన్ని నిధులు ఇస్తుంటే బీజేపీకి ఓటేయకపోవడం ఎంత బాధాకరం. అసెంబ్లీలో కాంగ్రెసోళ్లు కాళేశ్వరం మీద డ్రామాలాడుతోంది. బీఆర్ఎస్ నేతలు క్రిష్ణా నీటి నాటకాలాడుతున్నరు. అసెంబ్లీలో నిమిషానికి రూ.20వేలు ఖర్చవుతుంది. ఈ లెక్కన సభ నిర్వహణ కోసం కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ ప్రజా సమస్యలను, వాళ్లకిచ్చిన హామీలను గాలికొదిలేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరి ముఖాలు ఒకరు టీవీల్లో కన్పించేందుకు పోటీలు పడి డ్రామాలాడుతున్నరు. ఒకరికొకరు తిట్టుకుంటరు తప్ప వాటిపై చర్యలుండ వన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోరు. 10 ఏళ్ల పాలనలో కేసీఆర్ ఆస్తులు పెరిగినయే తప్ప.. ప్రజల ఆస్తులు పెరిగినయా? బీఆర్ఎస్ నేతలు గుడిని మింగితే.. కాంగ్రెసోళ్లు గుడి లింగాన్ని కూడా మింగేస్తరు అని అన్నారు.కాళేశ్వరం వల్ల రూ.లక్ష కోట్ల ప్రజాధనం వృధా అయ్యింది, అధికారంలోకి వస్తే సీబీఐ విచారణ జరిపిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఆ పని చేయడం లేదు? సిట్టింగ్ జడ్జితో విచారణకు సీజే అంగీకరించలేదు కాబట్టి తక్షణమే సీబీఐ విచారణ కోరి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఆయన అన్నారు.



# కేటీఆర్ బస్సుపై కోడిగుడ్లు

**నల్లగొండ - ప్రభాతసూర్యుడు :** నల్గొండలో బీఆర్ఎస్ బహిరంగసభకు ఎమ్మెల్యేలు వేళ్తున్న బస్సుపై ఎన్ఎస్యూఐ కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేశారు. నల్లదుస్తులు ధరించి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో 'వీటీ కాలనీ'లో ఉద్రిక్తత నెలకొంది. బస్సులో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఇతర ఎమ్మెల్యేలు వున్నారు.

# ఎన్నికల కోసమే కాళేశ్వరం కథ !

### కాంగ్రెస్ తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** శాసనసభలో సభా సంప్రదాయా లను ఉల్లంఘించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికార పక్షం మాట్లాడిన తర్వాత ప్రతి పక్షానికి అవకాశం ఇవ్వకపోవ డం సభా సంప్రదాయాలకు విరుద్ధమని చెప్పారు. మేడిగడ్డ పర్యటన ద్వారా తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్ రావు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లబ్ధిపొందిన ప్రజలను అడగాలని ప్రభుత్వానికి సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాళేశ్వరాన్ని వాడుకుంటున్నారని చెప్పారు.అయినా కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డనే కాదని.. అది 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల గ్రావిటి కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141



టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టీఎంసీల ఉపయోగం కలగలిసిన సమూహమే కాళేశ్వరం ప్రాజెక్టు అని చెప్పారు. ఒక్క బ్యారేజీలో ఒకటి రెండు కుంగిపోతే కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.మేడిగడ్డ సందర్శనలో భాగంగా మీరు వెళ్లే దారిలో రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కుడెల్లి వాగు, పచ్చటి పొలాలు చూడాలన్నారు. కాళేశ్వరం ఫలితాలను గురించి రైతులను అడగాలని సూచించారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రంగనాయకసాగర్‌ను చూసి అద్భుతమని మెచ్చుకున్నారని గుర్తుచేశారు. ప్రాజెక్టును సరిదిద్దే ప్రయత్నం చేయాలని సూచించారు. విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. చాప్రాల్ వైల్డ్ లైఫ్ ప్రాంతంలో ప్రాణహిత కట్టాలని చూస్తే అనేక అడ్డంకులు వస్తాయని చెప్పారు. నాడు కేంద్రం, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. ప్రాణహిత చేవెళ్లను ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. తాము నీళ్లు లేని ప్రాంతం నుంచి ప్రాజెక్టును తరలించి పంటలకు నీళ్లు అందించామన్నారు. మూడు కోట్ల మెట్రిక్ టన్నుల పంట పండిందంటే ఆ జలాల వల్లే జరిగిందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ హయాంలో పంజాగుట్ట ఫ్లై ఓవర్ కూలి 20 మంది చనిపోయారని, దేవాదుల పైపులు పేలి నీళ్లు ఆకాశమంత ఎగిరాయన్నారు. అలాంటి ఘటనలు జరగడం బాధాకరమని చెప్పారు. కానీ తాము ముందుకు వెళ్లాం కదా అని తెలిపారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించొద్దని తాము నిద్ర లేపితే లేచారని, ఈ రోజు బీఆర్ఎస్ సభ ఉందని మీరు డైవర్ట్ చేయడం కోసం పోటీ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# వైద్యం చేయాలా? కుక్కలకు కాపలా కాయాలా?



**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు :** కామారెడ్డి లో డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేయకపోతే సమ్మె చేయడానికి సిద్ధమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బంజారాహిల్స్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ప్రభు కుమార్ వెల్లడించారు. డాక్టర్లు వైద్యం చేయాలా లేక ఎలుకలకు, పిల్లులకు, కుక్కలకు కాపాల కాయాలా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కూడా వరంగల్ హాస్పిటల్‌లో ఎలుకలు కరిచాయని సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేశారు. అదే మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా కామారెడ్డి ఘటనలో డాక్టర్లను బాధ్యులు చేయడం సరికాదని అన్నారు. కొవిడ్ సమయంలో డాక్టర్లు తమ ప్రాణాలకు తెగించి వైద్యం చేశారు. ఎలుకలు, కుక్కలు, పిల్లులు చూసుకునేది శానిటరీ విభాగమని ఆయన పేర్కొన్నారు.

## సంపాదకీయమ్..

# ఇక కృష్ణుడు..!

ఐదు వందల ఏళ్లుగా వివాదాలు, సవాళ్లు, న్యాయపరమైన చిక్కులు, సమస్యలు అన్నీ దాటుకుని అయోధ్య రామ మందిర నిర్మాణం పూర్తయింది. ఈ మధ్యే ప్రారంభోత్సవమూ జరిగింది. ఎన్నో ఏళ్లుగా తమ అజెండాలో ఉన్న ఈ హామీని నెరవేర్చుకుంది బీజేపీ. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఈ కల నెరవేరిందంటూ ఇప్పటికే బీజేపీ ప్రచారం చేసుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల ముందు ఆ పార్టీకి మంచి జోష్ ఇచ్చే పరిణామం ఇది. దీన్ని రాజకీయాలకు ముడి పెట్టొద్దు అని ఎంతగా చెప్పినప్పటికీ అది సాధ్య పడడం లేదు. కాంగ్రెస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ సమస్యను తమ ప్రభుత్వం పరిష్కరించిందని ఇటీవలే హోం మంత్రి అమిత్ షా కూడా లోక్‌సభలో స్పష్టం చేశారు. అయోధ్య కన్నా ముందు కాశీ విశ్వనాథుని ఆలయాన్ని పునరుద్ధరించడం వల్ల మోదీపై హిందువులకు ఎనలేని గౌరవం పెరిగింది. హిందూ ధర్మాన్ని నడిపించే వ్యక్తి అంటూ ప్రశంసలు పొందుతున్నారు. అయితే...ఎన్నో న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొని అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని చేపట్టిన మోదీ సర్కార్...అప్పుడే మరో లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు తెలుస్తోంది. అదే మధుర ఆలయ నిర్మాణం. శ్రీకృష్ణ జన్మభూమిలో ఔరంగజేబు మసీదు కట్టించారని హిందువులు ఎప్పటి నుంచో వాదిస్తున్నారు. రామ జన్మభూమి వివాదం కొలిక్కి రావడం వల్ల ఇప్పుడు కృష్ణ జన్మభూమిపైనే అందరి దృష్టి నెలకొంది. దీనికి తోడు ఇటీవల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్..శ్రీకృష్ణ జన్మభూమిలో ఆలయం కట్టాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. అంటే...తమ అజెండాలో అది కూడా ఉందని హింట్ ఇచ్చారు. అయితే...కృష్ణ జన్మభూమి విషయంలోనూ ఎన్నో న్యాయపరమైన సవాళ్లని దాటుకోవాల్సి ఉంటుంది. యమునా నదీ తీరంలోని మధురలోనే శ్రీకృష్ణుడు జన్మించాడనేది హిందువుల బలమైన విశ్వాసం. ఇక్కడ ఒకటో శతాబ్దంలో విష్ణు ఆలయం నిర్మించారని చరిత్రకారుడు ఎంట్‌విసిల్ వెల్లడించాడు. రెండో చంద్రగుప్తుడు..అంటే విక్రమాదిత్యుడి కాలంలో ఇక్కడ మరో భారీ ఆలయం నిర్మించారని చెప్పాడు. ఇక్కడ పురావస్తు తవ్వకాల్లో మరి కొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విష్ణు ఆలయాని కన్నా ముందు ఇక్కడ బౌద్ధ ఆనవాళ్లు కనిపించాయి. బౌద్ధ నిర్మాణాలను ధ్వంసం చేసి ఇక్కడ విష్ణు ఆలయం నిర్మించారని ప్రముఖ ఆర్కియాలజిస్ట్ అలెగ్జాండర్ స్పష్టం చేశాడు. బౌద్ధ నిర్మాణాలకు ఉపయోగించిన రాతితోనే ఇక్కడ ఆలయాన్ని నిర్మించారనీ చెప్పాడు. ఇక్కడ హిందువుల ఆలయాలతో పాటు బౌద్ధులు, జైనుల నిర్మాణాలూ ఉన్నట్టు చరిత్రకారులు చెబుతున్నారు. అప్పట్లో ఇక్కడ బౌద్ధమతమే విస్తృతంగా ప్రచారంలో ఉండేదన్నది కొందరి విశ్లేషణ. అయితే..11వ శతాబ్దం నుంచి భారత్‌లో ముస్లిం పాలకుల ఆక్రమణలు మొదలయ్యాయి. ఆ సమయంలోనే ఆలయాలపై దాడులు జరిగాయి. గజనీ మధురలోని ఆలయంపై దాడి చేసినట్టు చరిత్ర చెబుతోంది. 1150 సంవత్సరానికి చెందిన ఓ సంస్కృత శాసనం ఇక్కడ విష్ణు ఆలయం ఉందని చెబుతోంది. ఇప్పుడదే స్థానంలో కేశవ్ దేవ్ ఆలయముంది. ఇక్కడి విష్ణు ఆలయం మేఘాల్ని తాకుతుందా అన్న ఎత్తుగా పాలరాతితో ధగధగా మెరిసిపోయేదని ఆ శాసనంలో రాసుంది. అయితే...వరస దాడులు జరగడం వల్ల రూపు రేఖలు లేకుండా పోయాయి. ఢిల్లీ సుల్తానుల దాడులతో ధ్వంసమైంది. 1556-1605 మధ్య కాలంలో అక్బర్ పాలనలో పరిస్థితులు కాస్త మెరుగుపడ్డాయి. అక్బర్ మూడు సార్లు మధురని సందర్శించినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. 1618లో అక్బర్ కొడుకు జహంగీర్ మధురలోని కత్రాలో ఆలయాన్ని నిర్మించాడు. 1659 లో ఔరంగజేబు వచ్చిన తరవాతే అసలు పతనం మొదలైంది. 1660లో అబ్దుల్ నబీ ఖాన్‌ని మధురకి గవర్నర్‌గా నియమించాడు ఔరంగజేబు. మధురలో అంతకు ముందు ఉన్న ఆలయాన్ని పడగొట్టి జామా మసీద్‌ని నిర్మించాడు. 1669లో ఔరంగజేబు సంచలన ఆదేశాలిచ్చాడు. మొఘల్ హయాంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో హిందూ నిర్మాణాల్ని ధ్వంసం చేయాలని తేల్చి చెప్పాడు. ఆ క్రమంలోనే 1670లో మధురలోని కేశవ్‌దేవ్ ఆలయాన్ని ధ్వంసం చేశారు. అక్కడే షాహీ ఈద్గా నిర్మించారు. అప్పటి వరకూ ఆలయంలో పని చేసిన పూజారులను ఆగ్రాకి తీసుకెళ్లి అక్కడే సజీవ సమాధి చేసినట్టు కొందరు చెబుతారు. ఈ ఈద్గా గురించే ఇప్పుడు వివాదమంతా నడుస్తోంది. కేశవ్‌దేవ్ ఆలయాన్ని ధ్వంసం చేసి మసీదు కట్టారని, అదే కృష్ణ జన్మభూమి అని హిందువులు వాదిస్తున్నారు. శ్రీకృష్ణుడు జన్మించిన స్థలానికి సమీపంలోనే ఉన్న కత్రా కేశవ్ దేవ్ ఆలయాన్ని ధ్వంసం చేసి 13.37 ఎకరాల భూమిలో ఈద్గా నిర్మించారన్నది హిందువుల వాదన. 1803లో మధుర బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పరిధిలోకి వెళ్లిపోయింది. 1815లో ఈ భూమిని ఈస్ట్ ఇండియా కంపెనీ వేలం వేసింది. అప్పట్లో రాజా పత్నిమల్ ఓ బ్యాంకర్ ఈ భూమిని కొనుగోలు చేశాడు. ఆ తరవాత 1944లో పత్నిమల్ వారసులు ఈ భూమిని ఇండస్ట్రియలిస్ట్ జుగల్ కిశోర్ బిర్లాకి విక్రయించాయి. 1951లో బిర్లా శ్రీ జన్మ భూమి ట్రస్ట్ ని ఏర్పాటు చేశాడు. ఇక్కడ ఆలయాన్ని నిర్మించేందుకు నిధులు సేకరించాడు. 1983 నాటికి ఆలయాన్ని పూర్తి చేశాడు. ఇప్పుడు ఈద్గా షాహి మసీదు పక్కనే ఉన్న ఆలయం ఇదే. 2020లో తొలిసారి ఈ స్థల వివాదంమొదలైంది. ఆ ఏడాది సెప్టెంబర్‌లో లక్నో వాసి, అడ్వకేట్ రంజన అగ్నిహోత్రితో పాటు మరో ఆరుగురు న్యాయ పోరాటం మొదలు పెట్టారు. కేశవ్ దేవ్ ఆలయ కాంప్లెక్స్‌లో ఉన్న మసీదుని వెంటనే తొలగించాలని పిటిషన్ వేశారు. అది కృష్ణ జన్మభూమిలో భాగమే అని వాదించారు. అయితే...ఈ పిటిషన్‌ని కోర్టు కొట్టేసింది. ఆ తరవాత ఈ వివాదం జిల్లా కోర్టుకి చేరుకుంది. ఆ తరవాత ఈ న్యాయ పోరాటం కొనసాగింది. అయితే..గతేడాది డిసెంబర్ 14వ తేదీన అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఇక్కడ యాఎ సర్వే జరిపేందుకు అనుమతినిచ్చింది. ఇక్కడ మసీదు ఆనవాళ్లను తొలగించి ఆ భూమిని పూర్తిగా ట్రస్ట్కి అప్పగించాలని పిటిషనర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే...సమాచార హక్కు చట్టంలో భాగంగా అడిగిన ఓ ప్రశ్నకు ఆర్కియాలజీ ఆసక్తికర సమాధానమిచ్చింది. ఔరంగజేబు ఇక్కడి ఆలయాన్ని ధ్వంసం చేశాడని తేల్చి చెప్పింది. ఇక్కడ హిందూ ఆలయానికి సంబంధించిన ఆనవాళ్లున్నాయని స్పష్టం చేసింది. 1920 నాటి గెజిట్‌లో ఇదే విషయం ఉన్నట్టు పేర్కొంది. జ్ఞానవాపి మసీదు కేసులో హిందువుల తరపు పోరాడిన అడ్వకేట్ విష్ణుశంకర్ జైన్..ఈ కేసు బాధ్యతలూ తీసున్నారు. జ్ఞానవాపి మసీదులో ఎలా అయితే యాఎ సర్వే జరిగిందో అదే తరహాలో ఈద్గా షాహిలోనూ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సర్వే నివేదిక ఇచ్చిన తరవాతే ఏం చేయాలనుకున్నా. అయితే...అయోధ్య రామజన్మ భూమి వివాదాన్ని ఎలా అయితే సామరస్యంగా పరిష్కరించుకున్నారో...ఈ కేసునీ అంతే సానుకూలంగా పరిష్కరించుకుంటుందన్న విశ్వాసం వ్యక్తమవుతోంది. దీనిపై యూపీ సర్కార్ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టింది. అన్ని సవాళ్లూ దాటుకుని రామ జన్మభూమి తరహాలో కృష్ణ జన్మభూమిని అభివృద్ధి చేయాలని కేంద్రం భావిస్తోంది.

# సాగర్‌లో సీడబ్ల్యూసీ..

**నాగార్జున సాగర్- ప్రభాతసూర్యుడు :** నాగార్జునసాగర్ లో మూడురోజుల పాటు సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో డ్యాం పరిశీలన జరుగుతోంది. అందులో భాగంగా విజయ విహార్ అతిథి గృహంలో సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో రివ్యూ సమావేశం జరిగింది. సమావేశం లో నేషనల్ సేఫ్టీ అథారిటీ, కృష్ణ రివర్ బోర్డు సభ్యులు, తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. డ్యాం భద్రత,స్పిల్ వే, నిటినిల్వలు, వినియోగంపై చర్చ చేసారు.



# ఎన్డీయే కూటమిలోకి మరిన్ని పార్టీలు

**బెంగళూరు, ప్రభాతసూర్యుడు :** రుణ శేషం.. శత్రుశేషం ఉండకూడదు అంటారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అలాంటి అంచనానే వేసుకున్నట్టున్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగానే గత రెండు పర్యాయాలు లేని విధంగా పొత్తులకు శ్రీకారం చుడుతున్నారు. అనేక సర్వే సంస్థలు బిజెపి సొంతంగా 370 స్థానాలు గెలుచుకుంటుందని చెబుతున్నప్పటికీ నరేంద్ర మోడీ, అమిత్ షా ద్వయం ఊరుకోవడం లేదు. జమ్మూ కాశ్మీర్ నుంచి మొదలుపెడితే తమిళనాడులోని రామేశ్వరం వరకు ప్రతి ప్రాంతం పైన అత్యంత సీరియస్‌గా దృష్టి సారించారు. "బలం ఉన్నచోట మరింత బలం పెంచుకోవడం.. బలం లేనిచోట బలాన్ని పెంచుకోవడం.." ఇదే సూత్రాన్ని అవలంబిస్తున్నారు. ఈ క్రమంలోనే సరికొత్త పొత్తులకు.. కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసే ఎత్తులు వేస్తున్నారు.ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాష్ట్రీయ లోక్ దళ్ ఇండియా కూటమి నుంచి బయటికి వచ్చింది. ఎన్నికల్లో నరేంద్ర మోడీకి మద్దతు ఇస్తామని ప్రకటించింది. రెండవ మాటకు తావు లేకుండా ఎన్డీఏలో చేరుతున్నామని ప్రకటించింది. వాస్తవానికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బిజెపికి విపరీతమైన బలం ఉంది. దానికి ఆ రాష్ట్రంలో ఇంకో పార్టీ అవసరం లేదు. కానీ రాష్ట్రీయ లోక్ దళ్ వస్తాను అని చెప్పగానే వెల్కం అంటూ చేర్చుకుంది. అక్కడ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రీయ లోక్ దళ్ సహాయంతో కొన్ని సీట్లయినా గెలుచుకోవాలని భావించింది. కానీ కాంగ్రెస్ పార్టీ అలా సీట్లు గెలుచుకుంటే మొదటికే మోసం వస్తుందని నరేంద్ర మోడీబి అమిత్ షా ద్వయం భావించి దానికి ఆస్కారం లేకుండా ఉండేందుకు పావులు కదిపారు. రాష్ట్రీయ లోక్ దళ్ ను ఎన్డీఏ కూటమిలో చేర్చుకున్నారు. కేవలం ఈ పార్టీ మాత్రమే కాదు కర్ణాటక కు చెందిన జనతా దళ్ యూనియన్ ఎన్డీఏ కూటమిలో చేరింది. గత ఎన్నికల్లో అక్కడ బిజెపి ఓడిపోయిన నేపథ్యంలో.. ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అక్కడ మెరుగైన స్థానాలు గెలుచుకోవాలని భావిస్తుంది. ఇందులో భాగంగానే కుమారస్వామి పార్టీకి ఆఫర్ ఇచ్చింది. స్వామి కూడా పోలోమంటూ ఎన్డీఏ కూటమిలో చేరారు.కేంద్రంలో ఈ దఫా కూడా అధికారంలోకి వస్తుంది అనే సానుకూల వార్తలు వినిపిస్తున్నప్పటికీ.. బిజెపి ఏ అవకాశాన్ని కూడా అంత సులభంగా వదులుకోవడం లేదు. ఎందుకంటే ఈసారి కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేయాలని భావిస్తున్నది. ఈ సారి ప్రభుత్వం ఏర్పడితే మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటామని నరేంద్ర మోడీ ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి ఇబ్బంది రాకుండా ఉండాలి అంటే ప్రతిపక్ష పార్టీల ముందరికాళ్ళకు బంధం వేయాలని బిజెపి భావిస్తోంది. ఈ క్రమంలోనే ఇండియా కూటమిలో లుకలుకలను తనకు అనుకూలంగా మలుచుకుంటున్నది. కాంగ్రెస్ పార్టీని ఒంటరిని చేసి 400కు పైచిలుకు స్థానాలను గెలుచుకుని మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాలని యోచిస్తోంది.. "ప్రతిపక్షాలు ఎక్కువ స్థాయిలో ఉంటే మాకు చాలా ఇబ్బంది. అవి మా చెవులను ఇబ్బంది పెడుతూనే ఉంటాయని" గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన తోమర్ పార్లమెంట్ లో వ్యాఖ్యానించారు. అప్పట్లో ఆయన ఊరకనే ఆ వ్యాఖ్యలు చేశారని అందరూ అనుకున్నారు. కానీ ఆ వ్యాఖ్యల వెనుక నరేంద్ర మోడీ ఉన్నారని ఎవరూ ఊహించలేదు.. కాంగ్రెస్ ను సాధ్యమైనంత వరకు నిర్వీర్యం చేసి.. తమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే పొత్తుల వెనుక పరమార్థం లాగా కనిపిస్తోంది. ఆ మధ్య "కుటుంబ నియంత్రణ అనేది వ్యక్తులకే.. రాజకీయ పార్టీలకు కాదు.. ఎంతమంది ఉంటే అంత బలం అని" అమిత్ షా వ్యాఖ్యానించారు.

# నోటి మాటలకు నీటి లెక్కలు తేలేనా..?

మొదటిపేజీ తరువాయి..

మీటింగ్లో కృష్ణా నది నీటి ప్రాజెక్టులను కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డుకు అప్పగించేందుకు గత ప్రభుత్వం ఒప్పుకున్న విషయం అర్ధరహితం. దీనికి ప్రస్తుత ప్రభుత్వంలోని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా రాసిన లేఖ నిదర్శనం. పేజీ నెంబర్:3 లోని పేరాగ్రాఫ్: సీ లో ఈ వివరాలు ఉన్నాయి. 17వ కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ మీటింగ్ లోను గత ప్రభుత్వం ప్రాజెక్టులను అప్పగించేందుకు ఒప్పుకోలేదన్న విషయాన్ని రాహుల్ బొజ్జా రాశారని" హరీష్ రావు పేర్కొన్నారు. అంతేకాదు నీటి వాటాల పంపకంపై 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తాము కేంద్రానికి 26 లేఖలు రాశామని హరీష్ రావు శాసనసభలో వెల్లడించారు. హరీష్ రావు మాట్లాడిన అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆయనదైన స్పందన వినిపించారు.." 2014బి22 సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు 512 టీఎంసీల నీరు ఇచ్చేందుకు ఒప్పుకుంది. గత సంవత్సరం నుంచి మాత్రమే 50:50 నిష్పత్తిలో వాటా అడుగుతోంది. అంతేకాదు ఎన్నికలకు ముందు ఏపీ ప్రభుత్వ పోలీసులు నాగార్జున సాగర్ ప్రాజెక్టు మీదికి వచ్చి హంగామా సృష్టించారు. దీనిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు భారత రాష్ట్ర సమితి ప్రయత్నించింది. ఇప్పుడు అధికారంతో పోగానే కృష్ణా నిర్మించిన ప్రాజెక్టుల విషయంలో అనవసరమైన హంగామా చేస్తున్నది. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తోంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించలేదని నీటిపారుదల శాఖ మంత్రిగా తాను చెబుతుంటే.. హరీష్ రావు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.మరోవైపు ఈ వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు.. తెలంగాణకు కృష్ణా నది నీళ్లు ప్రాణప్రదమని అన్నారు. ఎట్టి పరిస్థితిలో కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోమని స్పష్టం చేశారు. కృష్ణా నది నీళ్లపై చర్చ జరుగుతున్నప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు..కృష్ణా నది నీళ్లపై తెలంగాణకు 68 శాతం వాటా ఇవ్వాలని ప్రభుత్వం తీర్మానం పెడుతుంటే.. దానిని ఆమోదించకుండా.. సభకు రాకుండా.. వ్యవసాయ క్షేత్రంలో పడుకున్నారని కెసిఆర్ పై తీవ్ర విమర్శలు చేశారు. అంతేకాదు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సభలో ప్రవేశపెట్టిన "551 టీఎంసీల నీరు తెలంగాణకు రావాలి" అనే తీర్మానానికి కెసిఆర్ అనుకూలమా? కాదా? అనే విషయాన్ని తేల్చాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.ఇక రేవంత్ రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు. జనవరి 17 2024న కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు మీటింగ్ జరిగిందని.. కృష్ణ నదిపై నిర్మించిన ప్రాజెక్టులు కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని.. తెలంగాణకు అన్యాయం జరుగుతోందని.. వంటి విషయాలపై పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని హరీష్ రావు అన్నారు. ఈ వ్యవహారంపై తాము ఆందోళనలు చేస్తే ప్రభుత్వం అప్పుడు మేల్కొందని.. జనవరి 27 2024న ప్రస్తుత ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందన్నారు. అయితే ఆ లేఖలో మాత్రమే కేంద్రానికి ప్రాజెక్టులు అప్పగించడం లేదని ఉందన్నారు. ఇక ఫిబ్రవరి 1 2024న జరిగిన రెండవ సమావేశంలో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ కు అప్పగించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందని హరీష్ రావు అన్నారు.

# మేడిగడ్డలో ముఖ్యమంత్రి

మొదటిపేజీ తరువాయి..

దూరంగా ఉన్నారు. ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా ప్రజా ప్రతినిధుల బృందం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంతెనను పూర్తిగా పరిశీలించిన అనంతరం దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను అధికారులు ఇవ్వనున్నారు. మంగళవారం ఉదయం అసెంబ్లీ స్వల్ప కాలిక చర్చ అనంతరం సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల, అధికారుల బృందం మేడిగడ్డకు ప్రత్యేక బస్సుల్లో వచ్చారు.తెలంగాణ ప్రజల కష్టార్జితంతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ధన దాహానికి బలైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ఆయన.. బీఆర్ఎస్ అధినేతను విమర్శిస్తూ ట్వీట్ చేశారు. 'రూ. 97 వేల కోట్లు వ్యయం చేసి.. 97 వేల ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మేడిగడ్డ పర్యటనతో తెలంగాణ సమాజం తొమ్మిదిన్నరేళ్లు కేసీఆర్ పాలనలో విధ్వసమైన జల దృశ్యాన్ని కళ్లారా చూడబోతోంది.' అని ట్వీట్ లో పేర్కొన్నారు.

# బీహార్ అధికారుల్లో టెన్షన్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** గత ప్రభుత్వ హయాంలో కీలక శాఖల్లో చక్రం తిప్పిన బీహార్‌కు చెందిన ఐఏఎస్ అధికారుల్లో గుబులు మొదలయింది. బీహార్ ఐఏఎస్‌లకే పెద్దపీట వేశారని గతంలో పలుమార్లు ఆరోపించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి రాగానే వారిపై ఫోకస్ పెట్టారు. గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న అధికారుల శాఖల్లో అక్రమాల నిగ్గు తేల్చే పనిలో పడ్డారు. రేవంత్ సర్కార్ బిగిస్తున్న ఉచ్చుతో బీహార్ బాబులు టెన్షన్ టెన్షన్‌తో గడుపుతున్నారు. సోమేశ్‌కుమార్ ల్యాండ్ ఎపిసోడ్‌తో ఈ టెన్షన్ మొదలయింది. దీంతో ముందు జాగ్రత్త చర్యలు మొదలుపెట్టారు.ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఓ అడుగు ముందుకేసి భూబదలాయింపునకు రంగం సిద్ధం చేసుకున్నారు. బాలానగర్ హేమాజీపుర్‌లో ఆ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కుటుంబసభ్యులకు 52 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని అర్జంట్‌గా బదిలీ చేసే పనిలోపడ్డారు ఆ అధికారి. ఇప్పటికే ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ కోసం స్లాట్ బుక్ చేసేసుకున్నారు. గతంలో ఇరిగేషన్ శాఖలో కీలకంగా పనిచేసిన ఆ రిటైర్డ్ అధికారి అప్పట్లో ఓ కాంట్రాక్ట్ సంస్థతో లాలూచీ పడ్డట్టు ఆరోపణలున్నాయి. ఈ లాలూచీ వ్యవహారంపై మీడియాలోనూ వరుస కథనాలు వచ్చాయి. వ్యవహారం కోర్టు దాకా కూడా వెళ్లింది. ఇక ఇప్పుడు బీహార్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు సోమేశ్, అరవింద్ కుమార్ చుట్టూ వివాదాలు చెలరేగడంతో..ఇప్పుడా రిటైర్డ్ అధికారి తాను సమస్యల్లో చిక్కుకోకుండా బయడపడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మెుత్తంగా రేవంత్ సర్కార్.. విజిలెన్స్ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215